# ఈ ఇల్లు

కొడవటిగంటి కుటుంబరావు

## 1

చూడండి, ఈ ఇల్లు ఇప్పుడెట్లా ఉందో! ముందు నుంచి చూస్తే ఈ పాటయినా ఇల్లనిపిస్తున్నది. వెనకవేపు గోడంతా కూలిపోయింది. కప్పు లోపలికి దిగిపోయింది. కప్పుమీద సహం పెంకులైనా లేవు. పెంకులూ, ఇటుకలూ, వెదురుబద్దలూ ఎవరికి కావలసినవి వారు పట్టుకెళ్లారు. వెనకవేపు నూయి పాడుపడిపోయి ఉంది. దానిచుట్టూ కట్టిన బొడ్డు సహామే నిలిచి ఉంది. మిగిలినది లోపలికి విరిగిపడిపోయింది. ఇది ఒకప్పుడు వోరలబావి. ఇప్పుడు వోరలు కానరావు. ఏవో పిచ్చిమొక్కలు కూడా లోపల మొలిచాయి. లోపల నీరుంది, కాని లోతులేదు. పూడిపోయింది బావి. నీరు పాచిపట్టి ఎట్లావుందో చూడండి. దొడ్డియావత్తూ గడ్డిమొలిచి ఎట్లావుందో! ఏవేవో చెట్లు మొలిచాయి చుట్టూతా. ఇవి ఎవరూ, వేసినవి కావు. ఎవరు వేస్తారు ఇటువంటి చెట్లు? ఈ దొడ్డినిండా అనేకరకాల క్రిమి కీటకాదులూ, జంతువులూ యథేచ్ఛగా జీవిస్తున్నాయి. వాటికిప్పుడు నర భయం లేదు.

ఈ మొలలోతు గడ్డిలో, ఈ పిచ్చిమొక్కల నీడని నిత్యమూ, అనుక్షణమూ ఎన్నేసి హత్యలు జరుగుతున్నాయో! కాని ఇది యుద్ధభూమి కాదు. ఇక్కడ జరిగే హత్యలు యుద్ధమూ కాదు. ఇది జీవితం. ఇక్కడి జంతువులు ఒకదాన్నొకటి తింటున్నాయి. అయినా ఇక్కడే అవీ ఇవీ కూడా పుట్టి పెరుగుతున్నాయి. వేటివేటి కష్టసుఖాలు అవల్లా అనుభవిస్తూనే వున్నాయి. కాలం తీరి గిట్టిపోతున్నాయి. వాటిస్థానే మరోతరం ప్రాణులు వస్తున్నాయి...

## 2

ఈ ఇంట్లో ఒకప్పుడు మనుషులున్నారంటే నమ్మ శక్యం కాదు. ఈ బావిలో నీళ్లు తాగారంటే అవునా అనిపిస్తుంది. ఈ దొడ్లో మనుష్యులకు పనికివచ్చే కాయలచెట్లూ పూలచెట్లూ పెరిగాయంటే కాబోలనుకుంటాం.

ఈ ఆవరణలో ప్రస్తుతం పశు పక్షి క్రిమి కీటకాదులు బతుకున్నట్టే ఈ ఇంట్లో మనుష్యులు బతికారు. ఈ ఇంట్లో మనుషులు పుట్టారు, పెరిగారు, సుఖపడ్డారు, దుఃఖపడ్డారు, చచ్చారు.

ఉత్తరపువేపు గదిలో ఎన్నో కానుపులు జరిగాయి. దక్షిణపువేపు గదిలో ఎన్నో గర్భాదానాలు జరిగాయి. అయిదారుసార్లు ఇది పెళ్ళిల్లయింది. ఇంటిచుట్టూరా తాటాకు పందిళ్లు వేశారు. పడమటివేపు గాడిపొయ్యి తవ్వారు. అన్నాలు వార్చారు. వందలాదిజనం పందిళ్ళకింద భోంచేశారు.

ఈ గుమ్మాల కెన్నిసార్లు తోరణాలు కట్టారో, ఈ మండిగాల కెన్నిసార్లు పసుపు కుంకుమలు పెట్టారో, ఈ గోడల కెన్నిసార్లు సున్నాలు కొట్టారో చెప్పలేం. ఈ ఇల్లూ, దొడ్డీ రోజూ ఊడ్చి అందంగా ఉంచారు. గోడలకి రకరకాల పటాలూ, ఫోటోలూ వేళ్లాడతీశారు. ఎంతో ప్రేమగా ఇంటికి మరమ్మతులు చేసుకున్నారు.

ఈ ఇంటిని చూసి మనుషులు గర్వపడ్డారు; దీన్ని చూడగానే మనుష్యుల ప్రాణాలు లేచివచ్చాయి; ఈ ఇంటినుంచి బయటికి వెళ్ళిపోవాలంటే

మనుషుల హృదయాలు కుంగిపోయాయి! దీన్ని చూసి ఇతర మనుషులు ఏవగించుకున్నారు; దీన్ని వొదిలేసి మనుషులు లేచిపోయారు కూడాను.

ఎటువంటి మరమ్మతులు చెయ్యకపోయినా ఏళ్ళతరబడి ఈ ఇల్లు చెక్కుచెదరకుండా ఉన్న రోజులున్నాయి; దీన్ని మనుషులు విడిచిపోయిన రెండేళ్ళలోగా ఈ ఇల్లు కప్పన—ప్రేమను కోల్పోయిన హృదయంలాగా—కూలిపోయింది. మనుషులు చేసే చిన్నచిన్న సేవలు-ఊడవటమూ, బూజు దులపటమూ లాటివి—ఇంటికంత బలం ఇస్తాయా? లేక జీవుడుపోయిన మరుక్షణం కళే బరం క్రిములపాలయినట్టు, మనుషులు పోగానే ఇల్లుకూడా చచ్చిపోతుందా?

## 3

ఈ ఇల్లు అదివరకు బాగుందా, ఇప్పుడే బాగుందా అంటే స్పష్టంగా చెప్పలేను.

ఇప్పుడిక్కడ వాసంచేసే క్రిమి కీటకాలు చెయ్యని అత్యాచారాలు ఈ ఇంటో మనుషులు చేశారు.

ఒకనాటి రాత్రి ఈ వసారాలో ఒక మనిషి తన భార్యను గొంతుకోసి చంపాడు. అది జీవితావసర్యమైన హత్య కాదు...హత్యచేసినవాణ్ణి ద్వీపాంతరం పంపారు.

వెనకఉన్న ఆ బావిలో ఒక ఇల్లాలు ఒక రాత్రి దూకి ప్రాణత్యాగం చేసుకుంది.

ఈ ఇల్లు యుద్ధరంగంగా చాలాసార్లు మారింది. ఇక్కడ మనుషులు—కలిసికట్టుగా ఉండలేని మనుషులు-ఘోరంగా పోట్లాడుకున్నారు. కొట్టుకున్నారు. ఈ ఇంటిని పంచుకున్నారు. దీన్ని వడ్డీ వ్యాపారులకు తాకట్టు పెట్టుకున్నారు, అమ్ముకున్నారు. పోగొట్టుకున్నాక దీనికోసం ఏడిచారు. ఈ ఇంటినిగురించి కలలు కన్నారు. ఇంతకంటే కూడా మంచిఇళ్లు చూసి, "ఎంతబాగున్నా మన ఇల్లల్లే ఉండదేం?" అని ఆశ్చర్యపడ్డారు.

ఈ ఇంటి ఆవరణలో అత్యాచారాలు చెప్పరానన్ని జరిగాయి. భర్తలు భార్యలని తన్నారు, అవమానించారు, వీధిలోకి ఈడ్చారు, గదుల్లో పెట్టి బయట గొళ్లాలు పెట్టారు.

### కాబోయే రచయితలకు కిటుకులు:

కొత్తగా కలం పట్టుతున్నారు కదూ! శుభం. రాయండి. కథలు, కావ్యాలూ అన్నీ రాయండి.

కొత్తలో రాయడం అనేది కష్టమైన కార్యమే. అయితే చెప్పదలచుకొన్న విషయం ఏదైనా ఉంటే రచనకి అడ్డం ఉండదు. చాలా చిన్నవిషయమే అయినా దాన్నే మనోహరంగా చెప్పవచ్చు. ఆచెప్పేతీరునే 'శైలి' 'శిల్పం' అని పిలుస్తారు.

కొన్ని సంవత్సరాలు చెయ్యి తిరిగితే గాని స్వంతంగా 'వాది' అని చెప్పుకొనే 'శైలి' 'శిల్పం' అలవడకపోవచ్చు గానీ మీరు ఏమాదిరిగా మాట్లాడుకొంటారో ఆ మాదిరిగా రాయడం మొదలెడితే మంచిది.

మీరు రచనావ్యాసంగానికి మరీకొత్త వాళ్ళు కాబట్టి చెపుతున్నా. మీ మీ ప్రాంతాల్లో వాడుకగా మాటలు కాగితం మీద ఎక్కించడంలో శ్రద్ధ చూపండి.

ఇంతకుముందూ ఈ అంత్యలో నేను 'తెలిపిండికి' 'చేసిండికి' 'పరిశీలించండికి' అని కొన్ని మాటలు రాశాను. అవి విశాఖజిల్లాలో వాడుతారు. ఉభయ గోదావరులలో, కృష్ణా జిల్లాలో 'తెలిపేందుకు' 'చేసేందుకు' అంటారు.

ఒక జిల్లాభాష ఇంకో జిల్లాకు యాసలా కనబడడం సహజం. అయినా సహనం మనకి ఉండాలి. మాండలీకాలు ప్రయోగించడంలో తీసుకోవలసిన జాగ్రత్తలు తరవాత నింపాదిగా చెప్తాను.

వ్యాసాన్ని రాస్తారా? కాగితాలమీద ఒకపక్కే సిరాతో విడివిడిగా రాయండి. గొలుసుకట్టు కలిపిరాత ఎన్ని ఇబ్బందులు పెట్టగలదో ఊహించుకోండి. పరిశీలించి ప్రచురించే పత్రికలో ఆ విషయాన్ని తెలిపిండికి లేకపోతే మీ వ్యాసాన్ని మీకు వాపసు చేసిందికి మీ వ్యాసంతోపాటు ముందు కాన్న తపాలా బిళ్ళలు పంపండి.

మీ పూర్తిపేరు, చిరునామా వ్యాసం మీద రాయకపోతే ఎంత బాగున్నదాన్నైనా ప్రచురించిందికి వీలుండదు. మీరు ఈ కిటుకులు పాటించి రాయండి. శుభం. మీలో ఎందరు రచయితలవుతారో చూద్దాం. —సంపాదకుడు.

[illegible] చేతుల్లో అమానుషంగా తన్నులు తిన్నారు. ఈ గోడలూ ఘండిగాలూ కరుచుకుని దేవుడుకూడా దిక్కులేని స్థితిలో ఉన్నట్టు భావించుకుని ఏడిచారు.

లోకులను ద్రోహం చెయ్యటానికి ఈ ఇంట్లో గూడుపుఠాణీలు జరిగాయి.

ఇకప్పుడీ ఇంట్లో జూదంకూడా ఆడేవారు. ఒక రాత్రి ఒక పెద్దమనిషి ఆ జూదంలో అయిదు వందలు పోగొట్టుకున్నాడు.

## 4

అందుకని ఈ ఇల్లు ఇప్పుడే బాగుందని చెప్ప లేను.

కష్టసుఖాలు కావడికుండలు కావచ్చు. జీవితం కావడికాదు. జీవితం ముందుకుపొయ్యేది. ఇప్పుడిక్కడ నివసించే క్రిమికీటకాలనుంచి ఎన్నో కోట్ల శతాబ్దాలకాలం ముందుకుపోగా మానవులు వచ్చారు. మానవులే ఈ ఇల్లు కట్టారు.

ఆ సంగతి తెలిసే కాబోలు మానవులున్నంత కాలమూ యీ క్రిమికీటకాలు ఇక్కడ యథేచ్ఛగా జీవించలేకపోయాయి. మానవులు వెళ్ళిపోయి యీ ఇల్లు చచ్చిపోయేవరకూ వీటికిక్కడ స్థానం లేకపోయింది.

ఒకప్పుడీ స్థలంలో యీ క్రిమికీటకాల పూర్వులు నివసించేవి. మనుషులు వచ్చి వాటిని పారదోలారు. నేల బాగుచేశారు, దున్నారు, ఇక్కడ పంటలు పండించారు.

తర్వాత మానవులు ఇక్కడే తమ నివాసాలు ఏర్పరుచుకోవటానికి వచ్చారు. చెమటఓడ్చి యీ ప్రదేశానికి మట్టితోలారు, దిమ్మిసకొట్టారు. ఒక చిన్న పాక వేశారు. అందులో నివసించారు. దొడ్లో పాదులు వేసుకున్నారు, ప్రేమతో పెంచుకున్నారు. అనుభవించారు.

కాలక్రమాన పాకను మనుషులు వొదిలి వెళ్లారు. అది చచ్చిపోయింది.

ఇతర మనుషులు వచ్చారు. చెమటోడ్చి నేల బాగుచేశారు. ఇటుకలు తెచ్చారు, కలప తెచ్చారు, సున్నం తెచ్చి గానుగాడారు, పునాదులు తీశారు, గోడలు లేపారు, ఇల్లు కట్టారు.

మానవుడు సుఖంగా బతకటానికీ, దేవత్వం అందుకోవటానికీ ఏయే జ్ఞానమూ నీతీ అవసరమో అవల్లా యీ ఇంట్లో మనుషులు తెలుసుకున్నారు. ఒకరికొకరు బోధించుకున్నారు. ఆచరించలేకపోయినారు. అత్యాచారాలు చేశారు. దాటిపోయారు.

ఈ ఇంట్లో పుస్తకాలకి పూజ జరిగింది. మనుషులను మనుషులు ప్రేమించుకున్నారు. ప్రేమ అనేదాన్ని అవగాహన చేసుకోవటానికి ప్రయత్నించారు. ఆకాశాన్ని కౌగలించుకోబోయి మట్టిని కౌగలించారు. విఫలులైనారు. దాటిపోయారు.

ఈ ఇంట్లో మనుషులు ఒకరికోసం ఒకరు త్యాగాలుచేశారు. ఒకరికొకరు సానుభూతి చూపటానికి ప్రయత్నించారు. కాని పరస్పరం ఒకరినొకరు అర్థంచేసుకోలేకపోయినారు. త్యాగాలకూ, సానుభూతికీ విలువ తెలుసుకోలేకపోయారు. దాటిపోయారు.

## 5

ఈ కళేబరం ఇట్టే ఉండిపోదు. పనివాళ్ళు వస్తారు. దీన్ని లాగేస్తారు- చెమట ఓడ్చుతారు- పెద్దభవంతి కడతారు- విద్యుద్దీపాలు పెడతారు- ఇతర సౌకర్యాలు చేస్తారు-

దాన్ని అద్దెకిస్తారా? మ్యూరుబేరానికి అమ్ముతారా? మళ్ళీ దాన్నికూడా యుద్ధరంగంగా మారుస్తారా? అందులో కూడా అత్యాచారాలు జరుగుతాయా? మానవులు నీతీ, జ్ఞానమూ, ప్రేమా, సానుభూతీ, పారస్పర్యమూ అనేవి తెలుసుకోలేకుండానే అందులోకూడా జీవిస్తారా?

అదీ చచ్చిపోతుంది- అది మామూలు చావు చావదు- దానిమీద ఇంద్రుడు పిడుగులు కురిపిస్తాడు- వరుణుడు దాన్ని సముద్రంలో ముంచేస్తాడు- అది ప్రళయానలంలో భస్మీపటలమవుతుంది...

దాని స్థానంలో మరో ఇల్లు వస్తుంది-